nipuna
Every Wednesday Free Supplement
05.
30 అక్టోబర్ 2024
పేజీలు 8

**కర్నాటి ముఖేశ్**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి ముఖేశ్ జాతీయ స్థాయి పురస్కారానికి జూలై 24న ఎంపికయ్యారు. ప్రత్యేక డిజైన్‌తో ప్రకృతి రంగులతో పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర తయారు చేసినందుకు జాతీయ స్థాయి సెయింట్ కబీర్ హ్యాండ్లూమ్ పురస్కారం లభించింది. డబుల్ ఇక్కత్ విభాగంలో కేంద్ర చేనేత జౌళి శాఖ జాతీయ స్థాయిలో అందించే 2023 పురస్కారానికి దేశ వ్యాప్తంగా 14 మందిని ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ముఖేశ్‌కు గౌరవం దక్కింది.

# పరిశోధనల ఫలం – ప్రతిష్ఠాత్మక పురస్కారం

## నోబెల్-2024

**ప్రతిష్ఠాత్మక పురస్కారం నోబెల్‌ను ఈ ఏడాది ప్రకటించారు. ఏటా డిసెంబర్ 10న ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. 1896లో ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణించగా ఆయన పేరు మీదుగా 1901 నుంచి వివిధ రంగాల్లో విశేష పరిశోధనలు చేసినవారికి అవార్డులను అందజేస్తున్నారు. ఈ ఏడాది నోబెల్ వరించిన వారి గురించి తెలుసుకుందాం..**





### వైద్య శాస్త్రం




- వైద్యశాస్త్రంలో చేసిన విశేష పరిశోధనలకు అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు లభించింది. మైక్రో ఆర్ఎన్ఏ ఆవిష్కరణ, జన్యునియంత్రణలో దాని పాత్రను వివరించినందుకు ఈ అవార్డు దక్కింది. వీరికి రూ.8.91 (10 లక్షల డాలర్లు) కోట్ల నగదు అందజేస్తారు.
- మైక్రో ఆర్ఎన్ఏను సూక్ష్మ జన్యుపదార్థ సమూహంగా చెప్పవచ్చు. కణస్థాయిలో జన్యువుల పనితీరును నియంత్రించడంలో సాయపడటం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులు చికిత్సకు మైక్రో ఆర్ఎన్ఏ కొత్త మార్గాలను తెరిచింది. ఇది కొత్త ప్రొటీన్ల తయారీ సూచనలను అందించగలదు. దీంతో కొత్త మందుల అభివృద్ధికి ఉపయోగపడుతుంది.
- ఆంబ్రోస్ (అమెరికా, హాంప్‌షైర్) మసాచుసెట్స్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.
- గ్యారీ రువ్‌కున్ (అమెరికా, కాలిఫోర్నియా) హార్వర్డ్ యూనివర్సిటీలో జన్యుశాస్త్ర ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
- వైద్యశాస్త్రంలో 1901 నుంచి ఇప్పటి వరకు 115 మందికి ప్రకటించగా 229 మంది అందుకున్నారు. ఇందులో 13 మంది మహిళలు ఉన్నారు.

### భౌతిక శాస్త్రం




- జాన్ జే హోప్‌ఫీల్డ్, జెఫ్రీ ఈ హింటన్‌లకు లభించింది. జెఫ్రీ ఈ హింటన్‌ను 'ఏఐ పితామహుడిగా' పిలుస్తారు. కృత్రిమ మేధ (ఏఐ)లో అత్యంత కీలకమైన కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశారు. వీరు స్టాటిస్టికల్ ఫిజిక్స్‌కు సంబంధించి మౌలిక సూత్రాలను ఉపయోగించి ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌ను రూపొందించారు.
- జాన్ జే హోప్‌ఫీల్డ్ (91) ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, అమెరికా, న్యూజెర్సీ
- జియో ఫ్రే హింటన్ (77) టొరంటో యూనివర్సిటీ, కెనడా
- భౌతిక శాస్త్రంలో 1901 నుంచి ఇప్పటి వరకు 118 సార్లు నోబెల్‌ను ప్రకటించగా 227 మంది స్వీకరించారు. వీరిలో 5గురు మహిళలు ఉన్నారు.

### రసాయన శాస్త్రం




- డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లకు లభించింది. అమైనో ఆమ్లాల క్రమానుగతి, ప్రొటీన్ల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వీరు ఆవిష్కరించారు. ఈ బహుమతిలో సగం బేకర్‌కు, మిగతా సగం హసాబిస్, జాన్ జంపర్‌లకు సమంగా పంచుతారు. డేవిడ్ బేకర్ 2003లో తొలిసారి తన టీంతో కలిసి కొత్త ప్రొటీన్‌ను డిజైన్ చేశారు. డెమిస్ హసాబిస్, జాన్ మైఖేల్ జంపర్ సంయుక్తంగా ప్రొటీన్ల నిర్మాణాలను ఊహించగల కృత్రిమ మేధ నమూనాను రూపొందించారు. దీని సాయంతో 20 కోట్ల ప్రొటీన్ల నమూనాలను ముందే అంచనా వేయవచ్చు.
- డేవిడ్ బేకర్– వాషింగ్టన్ విశ్వవిద్యాలయం, అమెరికా, సియాటెల్
- హసాబిస్– ఏఐ ప్రయోగశాల, ఇంగ్లండ్, గూగుల్ డీప్ మైండ్, లండన్
- జాన్ జంపర్– ఏఐ ప్రయోగశాల, ఇంగ్లండ్, గూగుల్ డీప్ మైండ్, లండన్
- కెమిస్ట్రీలో 1901 నుంచి ఇప్పటివరకు 116 సార్లు ఈ పురస్కారాన్ని ప్రకటించగా 197 మంది అందుకున్నారు. 8 మంది మహిళలు ఉన్నారు.

### సాహిత్యం



- దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ రచయిత్రి హాన్‌కాంగ్ (53)ను వరించింది. చరిత్రలోని గాయాలను, మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని కవిత్వం ద్వారా ఆవిష్కరించారు. ఆమె రచనల్లో బలహీనులు ముఖ్యంగా మహిళల పట్ల సానుభూతి వ్యక్తమవుతుంది. సాహిత్యంలో మొట్టమొదటి నోబెల్ పొందిన ఆసియన్ రచయిత్రి హాన్‌కాంగ్. సాహిత్యంలో నోబెల్‌ను ఎక్కువగా యూరప్, ఉత్తర అమెరికా రచయితలకు ఇస్తున్నారన్న విమర్శల మధ్య హాన్‌కాంగ్ ఈ అవారున్డు గెలుచుకోవడం గమనార్హం. హాన్‌కాంగ్‌కు 2016లో 'ది వెజిటేరియన్' రచనకు బుకర్ ప్రైజ్ లభించింది. 2018లో ఈమె రాసిన ఇంటర్నేషనల్ హ్యూమన్ యాక్ట్ పుస్తకం సైతం ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ తుది జాబితాకు ఎంపికైంది. 1998లో ఆమె రాసిన తొలి నవల 'బ్లాక్ డీర్' మార్కెట్‌లోకి వచ్చింది.
- 2000లో దక్షిణ కొరియా అధ్యక్షుడు కిమ్ డే జంగ్‌కు నోబెల్ శాంతి లభించింది.
- 1901 నుంచి ఇప్పటి వరకు సాహిత్యంలో 117 సార్లు ప్రకటించగా, 121 మంది అందుకున్నారు. 18 మంది మహిళలు ఉన్నారు.

### శాంతి




- జపాన్‌కు చెందిన సంస్థ 'నిహాన్ హిడన్ క్యో' సంస్థకు నోబెల్ శాంతి లభించింది. 'అణ్వాస్త్రాలు కాదు ప్రజలకు అన్న వస్త్రాలు కావాలి' అంటూ అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు ఈ అవార్డు దక్కింది. ప్రపంచ దేశాలు అణ్వాయుధాల వినియోగానికి దూరంగా ఉండాలంటూ ఉద్యమాలు చేపట్టింది. హిరోషిమా, నాగసాకిలో అణుబాంబు దాడుల కారణంగా జీవచ్ఛవాలుగా మారిన వందల మంది బాధితుల జీవితగాథలను ప్రపంచానికి వివరిస్తూ... ప్రజలకు కావాల్సింది 'అణ్వస్త్రాలు కాదు, అన్న వస్త్రాలేనని చాటి చెబుతుందని నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ జార్గెన్ వాట్నే పేర్కొన్నారు.
- నాగసాకి, హిరోషిమా బాధితులు (హిబకుషా) తమకు ఎదురైన అనుభవాలతో 1956 ఆగస్ట్ 10న అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా 'నిహోన్ హిడాన్‌క్యో'ను ఏర్పాటు చేశారు. దీని ప్రధాన కార్యాలయం టోక్యోలోని మినాటోలోని షిబాడైమాన్‌లో ఉంది. 2017లో 'ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబాలిస్ న్యూక్లియర్ వెపన్స్' సంస్థకు, 1995లో జోసెఫ్ రోబో బ్లాట్, ఆయన నెలకొల్పిన సంస్థ 'పగ్ వాష్ కాన్ఫరెన్స్ సైన్స్ అండ్ వరల్డ్ అఫైర్స్'కు సంయుక్తంగా నోబెల్ శాంతి బహుమతి లభించింది.
- ఇప్పటి వరకు నోబెల్ శాంతి 105 సార్లు ప్రకటించి, 142 మందికి అందించారు. ఇందులో 19 మంది మహిళలు ఉన్నారు. 142 మంది గ్రహీతల్లో 111 మంది వ్యక్తులకు, 31 సంస్థలకు అందజేశారు.

### అర్థశాస్త్రం




- డాక్టర్ డారెన్ అసిమోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ రాబిన్సన్‌లకు లభించింది. దేశ శ్రేయస్సులో సామాజిక సంస్థల ప్రాముఖ్యతను పేర్కొన్నారు. చట్టపాలన పేలవంగా ఉన్నా సమాజాలు, జనాభాను దోపిడీ చేసే సంస్థలు.. అభివృద్ధిని, మెరుగైన మార్పును సృష్టించలేవని వీరి పరిశోధనల్లో తేలింది. కొన్ని దేశాలు ఎందుకు ఎదుగుతున్నాయి? మరికొన్ని ఎందుకు విఫలమవుతున్నాయి? అందుకు మూల కారణాలేంటి? మరింత మెరుగ్గా తెలుసుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడనుందని స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కమిటీ ఛైర్మన్ జాకబ్ స్వెన్సన్ తెలిపారు.
- డారెన్ అసిమోగ్లు, జేమ్స్ రాబిన్సన్ కలిసి రాసిన 'వై నేషన్స్ ఫెయిల్: ది ఆరిజన్స్ ఆఫ్ పవర్, ప్రాస్పరిటీ అండ్ పావర్టీ' పుస్తకం అత్యధిక కాపీలు అమ్ముడయ్యాయి. వ్యక్తుల తప్పిదాలే ఆయా దేశాలు పేదరికంలో మగ్గిపోడానికి కారణాలు అని పేర్కొన్నారు. అమెరికా మెక్సికో సరిహద్దులో ఉన్న అరిజోనా రాష్ట్ర నోగేల్స్ సిటీ ఉత్తర ప్రాంత వాసులు ప్రశాంతంగా జీవిస్తున్నారు.
- ఆయురార్దాయం ఎక్కువ. ఎక్కువ మంది విద్యార్థులు హైస్కూల్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్నారు. అదే దక్షిణం వైపు ప్రాంత ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. అక్కడ వ్యవస్థీకృత నేరాలు ఎక్కువ. ఆ ప్రాంతంలో వ్యాపారాలు చేయడం కూడా కష్టమే. అమెరికాలో అయితే పౌరుల ఆస్తి పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఇలాంటి విధానాలే ఒక రకంగా దేశం బాగుపడటానికి బాటలు వేస్తాయని అసిమోగ్లు వివరించారు.
- డారెన్ అసిమోగ్లు (58)– మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
- సైమన్ జాన్సన్ (58)– మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
- జేమ్స్ రాబిన్సన్ (64)– చికాగో యూనివర్సిటీ, అమెరికా
- ఇప్పటివరకు అర్థశాస్త్రంలో 56 సార్లు ప్రకటించగా 96 మంది అందుకున్నారు. ఇందులో ముగ్గురు మహిళలు ఉన్నారు.

### నోబెల్ విశేషాలు

- ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం 1901 నుంచి 5 విభాగాల్లో ఇస్తున్నారు.
- అర్థశాస్త్రంలో నోబెల్‌ను 1968లో స్వీడిష్ బ్యాంక్, స్వీడన్ సెంట్రల్ బ్యాంక్, స్వెరిజెస్‌రిక్స్ బ్యాంకు 300వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రారంభించారు.
- అర్థశాస్త్రంలో మొదటి నోబెల్‌ను 1969లో నార్వే దేశానికి చెందిన రాగ్నర్ ఫిష్, నెదర్లాండ్స్‌కు చెందిన జాన్ టిన్‌బెర్గెన్‌కు అందజేశారు.
- అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనార్ల (10 లక్షల డాలర్లు) నగదు అందజేస్తారు.
- నోబెల్‌ను గరిష్ఠంగా ముగ్గురుకు ఇస్తారు.
- ఏటా అక్టోబర్‌లో ముందుగా వైద్య శాస్త్రం, తర్వాత భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి, అర్థశాస్త్రాలకు ప్రకటిస్తారు.
- ఏటా డిసెంబర్ 10న నోబెల్ ప్రదానోత్సవం జరుగుతుంది.
- భారతీయ పౌరసత్వం ఉండి నోబెల్ అందుకున్నవారు ఐదుగురు. రవీంద్రనాథ్ ఠాగూర్, సర్ సీవీ రామన్, మదర్ థెరిసా, అమర్త్యసేన్, కైలాస్‌నాథ్ సత్యార్థి.
- 1901 నుంచి 2024 మధ్య 627 సార్లు, 1012 మంది వ్యక్తులకు నోబెల్‌ను అందించారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ సార్లు లభించింది. దీంతో 978 మంది వ్యక్తులకు, 28 సంస్థలకు అందజేశారు.
- 2024లో 12 మందికి నోబెల్ లభించింది. ఇందులో ఒక మహిళ ఉన్నారు.

**అనంతారపు కృష్ణయ్య**
డైరెక్టర్
శ్రీసాయి కోచింగ్ సెంటర్
కోదాడ
9948750605

